సాక్షి
అనకాపల్లి
మంగళవారం । 17 । జూన్ । 2025



అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు.

ఉష్ణోగ్రతలు

సోమవారం

		గరిష్టం/కనిష్టం
అనకాపల్లి	:	34.5/26.3
చోడవరం	:	36.0/24.0



కేజీహెచ్‌కు పరికరాల వితరణ

విశాఖ: కేజీహెచ్ న్యూరోసర్జరీ విభాగానికి దివంగత డా.బాలపరమేశ్వరరావు కుమార్తె రూ.8 లక్షల విలువైన పరికరాలను విరాళమిచ్చారు.

న్యూస్‌రీల్

4,903 మంది ఉపాధ్యాయులకు బదిలీ

ఆరిలోవ: ఉమ్మడి విశాఖ జిల్లాలో 4,903 మంది ఉపాధ్యాయులకు బదిలీ జరిగినట్లు డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఉపాధ్యాయ బదిలీలతో పాటు అర్హులైన ఉపాధ్యాయులకు పదోన్నతులు కూడా కల్పించినట్లు పేర్కొన్నారు. బదిలీల్లో 89 మంది గ్రేడ్–2 ఎచ్ఎంలు, 177 మంది మోడల్ ప్రైమరీ పాఠశాలల హెచ్ఎంలు, 78 మంది లాంగ్వేజ్ పండిట్‌లు, 10 మంది పీఈటీలు, 15 మంది ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్, ఇతరులు, 2,305 మంది స్కూల్ అసిస్టెంట్లు సమానమైన హోదా కలిగినవారు, 2,229 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లకు బదిలీలు జరిగినట్లు తెలిపారు. అలాగే 153 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించామన్నారు. గ్రేడ్–2 హెచ్‌ఎంలుగా 72 మందికి, ప్రైమరీ పాఠశాలల హెచ్‌ఎంలుగా 36 మందికి, స్కూల్ అసిస్టెంట్లుగా ఇంగ్లిష్–1, హిందీ–2, తెలుగు–2, బయోలజీ–16, గణితం–3, ఫిజికల్ ఎడ్యుకేషన్(పీడీ)–12, సోషల్ స్టడీస్–9 మందికి పదోన్నతులు కలించినట్లు తెలిపారు. పదోన్నతులు పొందినవారు, బదిలీలు జరిగినవారు కొత్త స్థానాల్లో చేరి సోమవారం నుంచి విధులు నిర్వహిస్తున్నారన్నారు.

నూకాంబిక హుండీ ఆదాయం రూ.38.62 లక్షలు



అమ్మవారి హుండీ లెక్కిస్తున్న అర్చకులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయంలో హుండీ లెక్కింపు కార్యక్రమం సోమవారం దేవదాయ ధర్మదాయశాఖ ఆధ్వర్యంలో జరిగింది. అమ్మవారి 42 రోజుల హుండీ ఆదాయం రూ 38,62,426లు, బంగారం 16,500 మిల్లీగ్రాములు, వెండి 900 గ్రాములు హుండీల్లో లభించినట్టు జిల్లా దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కె.ఎల్.సుధారాణి చెప్పారు. ఆలయ ఈవో వెంపలి రాంబాబు, ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ పీలా నాగ శ్రీను, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీల ఆగడాలు మితిమీరుతున్నాయి. నిబంధనలు తుంగలో తొక్కుతూ విద్యను వ్యాపారంగా మార్చేశాయి. పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాం, టై, బెల్టు..ఇలా అన్నీ బడిలోనే ప్రత్యేక స్టోర్లు ఏర్పాటు చేసి దర్జాగా వారికి ఇష్టం వచ్చిన ధరలకు పుస్తకాలు, సామగ్రి అమ్మకాలు చేస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. తల్లిదండ్రుల జేబుకు చిల్లు పెడుతున్నారు. ఈ దోపిడీని అరికట్టాలని జిల్లాలో ప్రముఖ కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీల వద్ద విద్యార్థి సంఘాల నాయకులు చేస్తున్న ఆందోళనలు, ఫిర్యాదులను విద్యాశాఖ అధికారులు షరా 'మామూలు'గానే పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.




విద్యాలయాలా.. వ్యాపార కేంద్రాలా?

- ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీల్లో అంతులేని దోపిడీ
- అధిక ధరలకు పుస్తకాలు, యూనిఫాం, సామగ్రి విక్రయాలు
- తడిసి మోపెడవుతున్న ఖర్చులు
- చూసీచూడనట్టు వ్యవహరిస్తున్న అధికారులు



ప్రైవేటు కాలేజీలపై చర్యలు తీసుకోవాలని డీఆర్వో సత్యనారాయణకు సోమవారం వినతి పత్రం అందిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు



యలమంచిలి రూరల్:

జిల్లాలో 500కు పైగా ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలలు, కార్పొరేట్ కాలేజీలు ఉన్నాయి. వీటిలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న చిన్న చిన్న బడ్జెట్ స్కూళ్లు మినహాయిస్తే మిగతా అన్ని విద్యా సంస్థల్లో విద్యా వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతోంది. ఒకవైపు అధిక ఫీజులతో సతమతమవుతున్న మధ్యతరగతి వర్గాల వారు ఈ ఏడాది భారీగా పెంచిన పుస్తకాల ధరలతో షాకవుతున్నారు. కొన్ని కార్పొరేట్ సంస్థల యాజమాన్యాలు సొంత సిలబస్ పేరుతో పుస్తకాలు ముద్రించి విద్యార్థులకు పంపిణీ చేస్తున్నాయి. ప్రభుత్వం ముద్రించిన పుస్తకాల ధరలు వందల్లో ఉంటే, ప్రైవేటు విద్యాసంస్థలు ముద్రించిన పుస్తకాల ధరలు వేలల్లో ఉంటున్నాయి. జిల్లాలో అనకాపల్లి, యలమంచిలి, చోడవరం, అచ్యుతాపురం, పాయకరావుపేట, నర్సీపట్నం సహా మండల కేంద్రాలు, మేజర్ పంచాయతీల్లో నిర్వహిస్తున్న పలు ప్రైవేటు పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, ఇతర సామగ్రి అమ్ముతున్న నిర్వాహకులు 1 నుంచి 5 తరగతి వరకు పుస్తకాలకు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు వసూలు చేస్తున్నారు. 6 నుంచి 10 తరగతులకు రూ.7,500 నుంచి రూ.10,500 వరకు వసూలు చేస్తున్నారు. ఇక ఇంటర్మీడియట్‌కైతే ఈ దోపిడీ మరింత ఎక్కువగా ఉంటోంది. నీట్, ఐఐటీ, ఐఏఎస్, ఒలింపియాడ్, సీ బ్యాచ్, ఎం బ్యాచ్, టెక్నో వంటి పేర్లతో అదనంగా వసూలు చేస్తున్నారు. బడి బస్సుల ధరలనూ అడ్డగోలుగా పెంచేస్తున్నారని.. మరో గత్యంతరం లేక వారు అడిగినంత చెల్లించాల్సి వస్తోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సూపర్ మార్కెట్ తరహాలో..

జిల్లాలో పాఠశాలలు పునఃప్రారంభం అయిన నేపథ్యంలో పేరొందిన ఐదు యాజమాన్యాలకు చెందిన కార్పొరేట్ విద్యాసంస్థల బ్రాంచీలన్నీ సూపర్ మార్కెట్‌లను తలపిస్తున్నాయి. విద్యార్థులకు సంబంధించిన పుస్తకాలు, యూనిఫాం, ఇతర సామగ్రితో స్టోర్లు ఏర్పాటు చేశారు. విద్యార్థులకు సంబంధించిన అన్ని వస్తువులూ తమ వద్దే కొనుగోలు చేయాలని హుకుం జారీ చేయడంతో గత్యంతరం లేక తల్లిదండ్రులు వారికి వేలాది రూపాయలు కుమ్మరిస్తున్నారు. ఇదంతా విద్యాశాఖ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. రెండ్రోజుల క్రితం భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) నాయకులు యలమంచిలి కోర్టు పేటలో ఉన్న ఒక కార్పొరేట్ విద్యాసంస్థలోకి వెళ్లి అక్కడ బుక్ స్టోర్‌ను పరిశీలించారు. ఇది స్కూలా.. పుస్తకాల దుకాణమా అని నిలదీయడంతో అక్కడ మహిళా సిబ్బంది సమాధానం చెప్పకుండా వెళ్లిపోయారు. అనకాపల్లి రెవెన్యూ కార్యాలయం ఎదురు వీధిలో ఉన్న ఒక కార్పొరేట్ కాలేజీ ఎదుట శనివారం ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆందోళనకు దిగారు. పుస్తకాలు విక్రయాలను అడ్డుకోవాలని, విద్యాసంస్థ దోపిడీని అరికట్టాలని నినాదాలు చేస్తూ విద్యాసంస్థ నేమ్ బోర్డులను ధ్వంసం చేశారు. ఇంత జరుగుతున్నా జిల్లా విద్యాశాఖ అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారని విద్యార్థి సంఘాల నాయకులు చెబుతున్నారు.

గుర్తింపు రద్దు చేయాలి



నిబంధనలు పాటించని ప్రైవేటు స్కూళ్లు, కాలేజీలపై అధికారులు చర్యలు తీసుకోవాలి. పాఠశాలల్లోనే అధిక ధరలకు పుస్తకాలు, యూనిఫాం విక్రయిస్తున్న విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయాలి. పుస్తక వ్యాపారాన్ని విద్యాశాఖ అధికారులు ఎందుకు కట్టడి చేయడం లేదో వారికే తెలియాలి. ప్రైవేటు విద్యా సంస్థల్లో పుస్తకాలు, అధిక ఫీజుల వసూళ్లపై చర్యలు తీసుకోవాలని డీఈవోకు ఫిర్యాదు చేశాం. అయినప్పటికీ స్పందన లేదు.

–మైలపల్లి బాలాజీ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు

చర్యలు తీసుకోవాలి



జిల్లాలో ప్రైవేటు స్కూళ్లు, కాలేజీల నిర్వాహకులు పలు రకాల ఫీజులతో తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నారు. ప్రతి ఏటా ఫీజులు ఇష్టారాజ్యంగా పెంచేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించడంలేదు. ఫీజుల వివరాలను నోటీసు బోర్డుల్లో డిస్ ప్లే చేయడం లేదు. సామగ్రి కొనక తప్పని పరిస్థితిని సృష్టిస్తున్నారు. విద్యాశాఖ అధికారులు తక్షణమే తనిఖీలు చేసి నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి.

–బి.బాబ్జీ, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు

జీవీఎంసీ కమిషనర్‌గా కేతన్‌గార్గ్



దాబాగార్డెన్స్ (విశాఖ): గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌కు దాదాపు ఐదు నెలల నిరీక్షణ తర్వాత ప్రభుత్వం సోమవారం నూతన కమిషనర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేస్తున్న కేతన్ గార్గ్ (రాజస్థాన్‌కు చెందిన 2018 బ్యాచ్ ఐఏఎస్ అధికారి) జీవీఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. గతంలో అనంతపురం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా, విజయనగరం, రాజాంపేటలో వివిధ హోదాల్లో గార్గ్ పనిచేశారు.

బస్‌పాస్ కౌంటర్ కిటకిట



అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద బస్‌పాస్‌ల కోసం విద్యార్థుల తిప్పలు

అనకాపల్లి: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో విద్యార్థులకు బస్‌పాస్‌లు జారీ చేసే కౌంటర్ సోమవారం కిటకిటలాడింది. ఈనెల 12 నుంచి బస్‌పాస్‌లు జారీ చేయాల్సి ఉంది. పాస్‌లను ఏపీఎస్ఆర్టీసీ బదులు ప్రజా రవాణాశాఖ పేరిట జారీ చేస్తున్నందున పాస్‌ల జారీని ఈసారి నాలుగు రోజులు ఆలస్యంగా సోమవారం ప్రారంభించారు. దీంతో విద్యార్థులు పాస్‌ల కోసం ఎగబడ్డారు.

'లెర్నింగ్ విత్ ఎర్నింగ్'

తుమ్మపాల: లెర్నింగ్ విత్ ఎర్నింగ్ అనే లక్ష్యంతో రూపొందించిన స్కోలార్క్ ప్రాజెక్టు విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ఉందని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి బి.సుజాత అన్నారు. స్కోలార్క్ ఇన్నోవేషన్స్ ప్రాజెక్టుపై కంపెనీ సీఈవో నిస్సీ, ప్రతినిధులు సోమవారం ఆమెను కలిసి విద్యార్థులకు ఉపయోగపడే విధానాలను వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా అకడమిక్ సంబంధ విషయాలను బోధిస్తామని చెప్పారు. చిన్న చిన్న టాస్కుల ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యం పెంపుదల జరుగుతుందన్నారు. టాస్కులు పూర్తి చేసిన విద్యార్థులకు పారితోషికం చెల్లిస్తామని సీఈవో తెలిపారు. స్వచ్ఛందంగా చేరిన విద్యార్థులను మాత్రమే లెర్నింగ్ విత్ ఎర్నింగ్‌లో భాగస్వాములను చేస్తామన్నారు.

ఆదివాసీ గ్రామంలో పోలీసు సేవలు

- దట్టమైన అడవిలో నడిచి వెళ్లిన అధికారులు



గిరిజనులకు దుస్తులు, వాలీబాల్ కిట్లు అందిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు



కాలి నడకన వెళుతున్న పోలీసులు


గొలుగొండ: అల్లూరి పార్కుకు 8 కి.మీ. దూరంలో ఉన్న చుక్కపనుకులు ఆదివాసీ గిరిజన గ్రామాన్ని పోలీసులు సోమవారం కాలినడకన సందర్శించారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు, రూరల్ సీఐ రేవతమ్మ, కృష్ణదేవిపేట ఎస్ఐ తారకేశ్వరరావు తదితరులు కాలినడకన సుమారు 3 గంటలపాటు నడిచి గ్రామానికి చేరుకున్నారు. వారి ఆరోగ్య పరిస్థితి గురించి డీఎస్పీ వివరాలు తెలుసుకున్నారు. పోడు వ్యవసాయం చేసుకుంటూ 10 సంవత్సరాల నుంచి 14 కుటుంబాల వారం ఇక్కడ జీవిస్తున్నామని, ఏ కష్టం వచ్చినా కృష్ణదేవిపేట అడవుల గుండా నడిచి వెళ్లాల్సిందేనన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సమకూర్చిన విద్యుత్ సదుపాయం తప్ప ఎటువంటి మౌలిక వసతులు లేవని గిరిజనులు తెలిపారు.

సేవా కార్యక్రమాలు

కృష్ణదేవిపేట హోమియో వైద్యాధికారి హేమలత గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. గ్రామంలో మహిళలకు రెండు చీరలు, మగవారికి పంచెలు, గొడుగులు అందజేశారు. డీఎస్పీ శ్రీనివాసరావు యువతకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. ఇక్కడి సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని, ఏ కష్టం వచ్చినా కృష్ణదేవిపేట ఎస్ఐకి తెలియపరచాలన్నారు.

యోగాంధ్రకు సర్వం సన్నద్ధం

- 21న విశాఖలో అంతర్జాతీయ యోగా దినోత్సవం
- పాల్గొననున్న ప్రధాని మోదీ
- 5 లక్షల మందితో యోగాసనాలు
- గిన్నిస్ రికార్డు కోసం ప్రణాళికలు



విశాఖ సిటీ: యోగాంధ్రకు నగరం ముస్తాబవుతోంది. ఐదు లక్షల మంది యోగాసనాలకు విశాఖ వేదిక అవుతోంది. గిన్నిస్ బుక్ రికార్డుల్లోకి ఎక్కేందుకు సమాయత్తమవుతోంది. అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు ఈ నెల 21వ తేదీన విశాఖ ఆతిథ్యమిస్తోంది. ఈ కార్యక్రమానికి దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రులు, అనేక మంది ప్రముఖులు ఈ వేడుకకు తరలిరానున్నారు. కాళీమాత ఆలయం నుంచి పార్కు హోటల్ వరకు ప్రధాన వేదిక కానుంది. ఇక్కడే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఇతర ప్రముఖులు, నేవీ అధికారులు, అధికారులు యోగాసనాలు చేయనున్నారు. ఈ రెండు కిలోమీటర్ల మేర ప్రధాన వేదికలో 12 కంపార్ట్‌మెంట్లు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి కంపార్ట్‌మెంట్‌లో వెయ్యి మంది ఉంటారు. ప్రధాన వేదిక తర్వాత సీ1 కంపార్ట్‌మెంట్ ఉంటుంది. పార్కు హోటల్ వరకు మొత్తం 12 కంపార్ట్‌మెంట్లు ఉంటాయి. సీ6 వరకు 9 వేల మంది ఇండియన్ నేవీ, కోస్ట్ గార్డు సిబ్బందితో పాటు, ఇంటర్నేషనల్ యోగా స్టూడెంట్స్, యోగా అసోసియేషన్ సభ్యులు, వివిధ స్థాయిల్లో యోగా పోటీల్లో విజేతలుగా నిలిచిన వారు పాల్గొంటారు. అలాగే సీ7 నుంచి సీ12 వరకు గల కంపార్ట్‌మెంట్లలో సమీపంలోని నివాసితులు భాగస్వామ్యమవుతారు. ఈ ప్రధాన వేదిక వద్ద పాల్గొనే వారి అవసరాలకు అనుగుణంగా 1400 టాయిలెట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రధాన వేదిక ప్రాంతంలో అదనపు కంపార్ట్‌మెంట్లతో కలిపి మొత్తం 15 వేల మంది పాల్గొననున్నారు. ఒక వేళ వర్షం పడితే ఈ ప్రధాన వేదికను ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ మైదానంలోకి మార్చనున్నారు.

- ఆర్కే బీచ్ రోడ్‌లోని కాళీమాత ఆలయం నుంచి భీమిలి వరకు ఏకకాలంలో 5 లక్షల మంది యోగాసనాలు చేసే విధంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.
- మొత్తంగా 326 కంపార్టుమెంట్లు సిద్ధం చేస్తున్నారు. ప్రధాన వేదిక మినహా మిగిలిన కంపార్ట్‌మెంట్లలో 3.5 లక్షల మందికి చోటు కల్పిస్తున్నారు.
- ప్రజలు కంపార్ట్‌మెంట్లలోకి చేరుకున్న తర్వాత టీషర్టు, క్యూఆర్ కోడ్ అందజేస్తారు.
- తాగునీరు, పారిశుధ్యం, ఆహారం, వైద్య సిబ్బందితో పాటు పోలీసులతో పాటు 10 మంది వలంటీర్లు ఒక్కో కంపార్ట్‌మెంట్‌లో అందుబాటులో ఉంటారు.
- ప్రతి రెండు లేదా మూడు కంపార్ట్‌మెంట్లకు అనుబంధంగా 20 బెడ్లతో కూడిన వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నారు.
- విశాఖ నుంచే కాకుండా ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో జనసమీకరణకు సన్నాహాలు చేస్తున్నారు.



మెగా ఈవెంట్‌కు సిద్ధమవుతున్న విశాఖ సాగర తీరం

- ప్రజలను తరలించేందుకు మొత్తంగా 10,235 ప్రభుత్వ, ప్రైవేటు బస్సులు, ఆటోలు, ఇతర వాహనాలను వినియోగించనున్నారు.
- అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల ద్వారా గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డుల్లోకి ఎక్కేందుకు యంత్రాంగం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఏకంగా 22 రికార్డులు దక్కించుకునేందుకు కసరత్తు చేస్తోంది. విశాఖ సముద్ర తీరంలో 11 నావికాదళ నౌకలపై నేవీ అధికారులు, సిబ్బంది యోగాసనాలు వేయనున్నారు. ఇది కూడా రికార్డు క్రియేట్ చేసే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. అల్లూరి జిల్లాకు చెందిన 25 వేల మంది గిరిజన విద్యార్థులు ఆంధ్రా యూనివర్సిటీ మైదానంలో యోగా చేయనున్నారు. ఇది కూడా రికార్డు నెలకొల్పే అవకాశముంది.

మోసం.. అరాచకం

- ఏడాది పాలనలో చంద్రబాబు ప్రజలకు ఇచ్చింది ఇదే..
- సూపర్ సిక్స్ పథకాల పేరుతో వెన్నుపోటు
- అమరావతిపై ఉన్న శ్రద్ధ ఉత్తరాంధ్ర జిల్లాలపై ఎందుకు లేదు
- గోవాడ సుగర్ ఫ్యాక్టరీని మూతపడే స్థాయికి దిగజార్చారు
- మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ధ్వజం
- 'జగన్ అంటే నమ్మకం–చంద్రబాబు అంటే మోసం' పుస్తకావిష్కరణ



'జగన్ అంటే నమ్మకం–చంద్రబాబు అంటే మోసం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: చంద్రబాబు ఏడాది పాలనలో మోసాలు, అరాచకాలు, అక్రమ అరెస్టులు తప్ప చేసిందేమి లేదని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ రాజకీయ సలహా మండలి సభ్యుడు బూడి ముత్యాలనాయుడు విమర్శించారు. తారువలో 'జగన్ అంటే నమ్మకం–చంద్రబాబు అంటే మోసం' పేరిట చంద్రబాబు ఏడాది పాలనలో అరాచకాలు, మోసాలను వివరిస్తూ ప్రచురించిన పుస్తకాన్ని ఆయన సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని చెప్పిన చంద్రబాబు ఏడాది పూర్తయినా ఇవ్వకుండా రాష్ట్ర ప్రజలను వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు. జగన్ పాలనలో ఏడాదిలోనే 90 శాతం హామీలను ఒక్కొక్కటిగా అమలు చేశారని గుర్తు చేశారు. అమరావతిపై ఉన్న శ్రద్ధ వెనుకబడిన ఉత్తరాంధ్ర జిల్లాలపై ఎందుకు లేదని నిలదీశారు.

యువతపై చిన్నచూపు

టెన్త్ పరీక్ష ఫలితాల్లో తప్పులు, తడకలతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు పడ్డారని, విద్యాశాఖ మంత్రి వైఫల్యానికి ఇది నిదర్శనమని ముత్యాలనాయుడు విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన అమలు ఎక్కడని ప్రశ్నించారు. ఉద్యోగాలు కల్పించకుంటే నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఎందుకు ఇవ్వడం లేదని నిలదీశారు. జగన్ హయాంలో ఆరోగ్యశ్రీలో రూ.25 లక్షల వరకు భరోసా కల్పించగా, ప్రస్తుతం సక్రమంగా అమలు కాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు కనీసం మందులు సరఫరా చేయలేని దుస్థితిలో కూటమి ఉందన్నారు. కేంద్రం ఇచ్చే నగదుతో సంబంధం లేకుండా అన్నదాత సుఖీభవ పేరిట ఏటా రైతులకు రూ.20 వేలు ఇస్తామని చెప్పి మాట మార్చడం సరికాదన్నారు. గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం బెల్టు షాపులు ఏర్పాటు చేసి ఏరులై పారిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో వారంతా ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీని మూతపడే స్థాయికి దిగజార్చారని, మినీ మహానాడులో ఆ పార్టీ స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి స్వయంగా చెప్పడమే ఇందుకు నిదర్శనమన్నారు. నిధులు అడిగినా ఇవ్వడం లేదని ఎమ్మెల్యే బాహాటంగా చెప్పారని, ఈ ప్రభుత్వ పాలన తీరుకు అద్దం పడుతుందన్నారు. ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, వైస్ ఎంపీపీ పంచాడ సింహాచలంనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబూరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వరదపురెడ్డి లలితానాయుడు, ఆర్టీఐ విభాగం జిల్లా అధ్యక్షుడు కె.వి.రమణ, మండల యువజన అధ్యక్షుడు కర్రి సూరినాయుడు, ఉపాధ్యక్షుడు బండారు దేముడునాయుడు, ఎంపీటీసీలు కోలా గోపి, పోతల వెంకటరావు, సర్పంచ్‌లు రొంగలి వెంకటరావు, నాగిరెడ్డి శరారినాయుడు పాల్గొన్నారు.

కేసులు.. వేధింపులు

- సమాధానం చెప్పలేక ప్రశ్నించిన వారిపై కక్షసాధింపులు
- ఘనత వహించిన కూటమి సర్కారు పాలన తీరిది..
- మహిళలపై అఘాయిత్యాలు.. క్షీణించిన శాంతిభద్రతలు
- ఏ ఒక్క హామీనీ చిత్తశుద్ధితో పూర్తి చేయని చంద్రబాబు
- మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ధ్వజం



చోడవరంలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గుడివాడ అమర్‌నాథ్

చోడవరం: ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టడం తప్ప కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలకు మేలు చేసిందేమీ లేదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, చోడవరం సమన్వయకర్త గుడివాడ అమర్‌నాథ్ విమర్శించారు. 'జగన్ అంటే నమ్మకం ..చంద్రబాబు అంటే మోసం' పేరిట వైఎస్సార్‌సీపీ రూపొందించిన పుస్తకాన్ని చోడవరం పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన ఆవిష్కరించారు. పుస్తక ప్రతులను పార్టీ శ్రేణులకు పంపిణీ చేసి గ్రామాల్లో ప్రజలకు వాటిని చదివి వినిపించి, కూటమి ప్రభుత్వం ప్రజలను ఎలా మోసం చేసిందే తెలియజేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పోరాట ఫలితంగానే తమ ప్రభుత్వం అమలు చేసిన 'అమ్మ ఒడి' పథకం పేరు మార్చి ఇటీవల కొనసాగించారే తప్ప వారు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్క పథకాన్ని పూర్తిగా అమలు చేయలేదని అమర్‌నాథ్ ధ్వజమెత్తారు. ఏడాది పాలనలో పరిపాలనను పక్కన పెట్టి ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టడం, హత్యలు చేయించడం, దాడులు చేయడం తప్ప ప్రజల కోసం ఏమీ పనిచేయలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీకి చెందిన 390మంది నాయకులను కూటమి ప్రభుత్వం హత్య చేసిందన్నారు. అనేక మంది మహిళలపై అఘాయిత్యాలు జరిగినా పట్టించుకోకుండా రాష్ట్రంలో శాంతిభద్రతలను నిర్వీర్యం చేశారన్నారు. సోషల్ మీడియా ద్వారా ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేసి దౌర్జన్య పాలన చేస్తున్నారని ధ్వజమెత్తారు. అభివృద్ధికి నోచుకోకుండా ఏ విధంగా ఇబ్బందులు పడుతున్నారో ఈ పుస్తకంలో తెలియజేశామన్నారు.

అన్నీ అబద్ధాలే..

ఏడాది పాలనలో రూ.1.5 లక్షల కోట్లు అప్పు చేయడం తప్ప రాష్ట్ర ప్రజలకు మాత్రం చంద్రబాబునాయుడు ఏమీ చేయలేదన్నారు. హామీలు గురించి అడిగితే అన్నీ చేసేశానంటూ అబద్ధాలు ఆడుతున్నారన్నారు. మహిళలకు ఇస్తామన్న ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, రైతు భరోసా, ఉచిత బస్సు పథకాలు ఏవీ అమలు చేయలేదన్నారు. సంక్రాంతి కల్లా రోడ్లన్నీ బాగుచేస్తామని చెప్పినా ఏమాత్రం పురోగతి లేదన్నారు. ప్రతిపక్షంగా ప్రజల పక్షాన ఎప్పుడూ పోరాటం చేస్తామని, ప్రజలను చంద్రబాబు ప్రభుత్వం ఎలా మోసం చేస్తుందో గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తామని అమర్‌నాథ్ అన్నారు. అనంతరం కార్యకర్తలతో వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏడువాక సత్యారావు, జెడ్పీటీసీలు దొండా రాంబాబు, తలారి ఆదిమూర్తి, ఎంపీపీలు యర్రంశెట్టి శ్రీనివాసరావు, పైల రాజు, పార్టీ జిల్లా యువజన, రైతు విభాగాల అధ్యక్షులు పుల్లేటి వెంకటేష్, బొడ్డేడ సూర్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షులు దొడ్డి వెంకట్రావు, ముక్కా మహాలక్ష్మి నాయుడు, కొల్లిమల్ల అచ్చెంనాయుడు, జిల్లా ఉపాధ్యక్షురాలు బొగ్గు శ్యామల పాల్గొన్నారు

పీఏసీఎస్‌లో రూ.2 కోట్ల అవకతవకలపై విచారణ


అవకతవకలపై విచారణాధికారి సీనియర్ ఇన్‌స్పెక్టర్ ప్రసీద్ కుమార్‌కి వివరిస్తున్న ఫిర్యాదుదారు

రోలుగుంట : మండలంలోని జానకీరాంపురంలోని పీఏసీఎస్‌లో సుమారు రెండు కోట్ల రూపాయల మేర అవకతవకలు జరిగాయని అందిన ఫిర్యాదుపై సుమారు ఏడాదిన్నర కాలంగా విచారణ సాగుతూనే ఉన్న విషయం విదితమే. మూడు నెలలకు ఒకసారి ఆ శాఖలో ఒకరిని విచారణాధికారిగా నియమించడం నామమాత్ర విచారణ జరపడం, వెళ్లిపోవడం జరుగుతుందే కానీ స్పష్టమైన చర్యలు తీసుకోలేదు. 51 సెక్షన్ ప్రకారం విచారణ చేసి నిగ్గుతేల్చాలని ఫిర్యాదుదారులు డిమాండు చేస్తున్నారు. దీనిలో బాగంగా ఆ శాఖ ఉన్నతాధికారి , ఫిర్యాదుదారులు కిల్లాడ సాంబమూర్తినాయుడు, గొర్లె రాంబాబు, నారాయణరావు, పెదపాటి శ్రీనివాసరావు గత వారం చేసిన ఫిర్యాదు మేరకు చోడవరం డివిజన్ సీనియర్ ఇన్‌స్పెక్టర్ వి.వి.ప్రసీద్ కుమార్‌కు విచారణ బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఆయన సోమవారం పీఏసీఎస్‌కు వచ్చి ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఫిర్యాదు దారులను విచారణ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఈ విచారణలో పాల్గొన్న కిల్లాడ సాంబమూర్తినాయుడు, నారాయణరావు, గొర్లె రాంబాబు, నారాయణరావు, పెదపాటి శ్రీనివాసరావు నిబంధనలకు విరుద్ధంగా సస్పెండైన బి.వి.వి.ఆర్.జె కృష్ణ భార్య జోగులమ్మ పేరున మంజూరైన రూ.2:50 లక్షలు వెంటనే జమ చేయించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. సుమారు 250 మంది సభ్యులకు చెందిన చార్జి డిక్లరేషన్ రుణాల నిగ్గు తేలాలంటే 51 సెక్షన్ విచారణ అమలు చేయాలని డిమాండు చేశారు. భూమిలేకుండా ఇచ్చిన రుణాల బాధితులు, బినామీలు అధిక సంఖ్యలో పాల్గొని తమకు జరిగిన అన్యాయాన్ని విచారణాధికారికి వివరించారు. ఈ సందర్భంగా విచారణలో ఫిర్యాదుదారుల తెలిపిన వివరాలు నమోదు చేయడం జరిగిందని, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని విచారణ అధికారి తెలిపారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

వివాదాస్పదమైన 334 ఎకరాల రిజిస్ట్రీ రద్దు చేయాలని ఫిర్యాదు


వివాదాస్పద భూమి జీపీఏను రద్దు చేయాలంటూ నిరసన చేస్తున్న రైతులు

తుమ్మపాల: నక్కపల్లి మండలం పెద్దదొడ్డిగుళ్లలో రైతులకు చెందిన 334 ఎకరాల వివాదాస్పద భూమిని రాజకీయ నాయకుడు సుబ్బరాజు తప్పుడు మార్గంలో చేయించుకున్న (ఇర్రివోకబుల్) జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ దస్తావేజును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సర్పంచ్ బొర్ల విజయలక్ష్మితో కలిసి గ్రామస్తులు కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. అనంతరం వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు సీరం నర్సింమూర్తి ఆధ్వర్యంలో కలెక్టర్ విజయ కృష్ణన్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలో సర్వే నంబరు1లో రైతులు సాగు చేసుకుంటున్న 334 ఎకరాలను 2019 నుంచి వివాదంలో ఉందని స్థానిక రెవెన్యూ అధికారులు ధ్రువీకరించినప్పటికీ సుబ్బరాజు లాంటి నాయకులు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. సదరు వ్యక్తి విజయవాడలో తప్పుడు జీపీఏలు రిజిస్ట్రీ చేసుకోవడం నిబంధనలకు విరుద్ధమన్నారు. సదరు భూమికి సమీపంలో ఫారెస్టు అధికారుల లేఖల పైనా సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. రైతుల హక్కులకు ఎటువంటి ఆటంకం కలగకుండా న్యాయం చేయాలని కోరారు.

ఎస్పీ కార్యాలయానికి 35 అర్జీలు

అనకాపల్లి: ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 35 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా అర్జీదారుల నుంచి అదనపు ఎస్పీ ఎల్.మోహన్‌రావు అర్జీలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ కుటుంబ సమస్యలు, ఆస్తి తగాదాలు, చీటింగ్, మోసపూరిత హామీలపై అర్జీలు వచ్చాయని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌ఐ డి.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


అర్జీదారుల సమస్యలు వింటున్న ఏఎస్పీ మోహన్‌రావు


పట్టుబడిన గంజాయి నిందితుడితో పోలీసులు

గంజాయి స్వాధీనం

ఎస్.రాయవరం: మండలంలో పెదగుమ్ములూరు జంక్షన్ సమీపంలో నర్సీపట్నం ఆర్అండ్‌బీ రోడ్డుపై ఒకరి నుంచి రెండున్నర కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ విభీషణరావు సోమవారం తెలిపారు. హైదారాబాద్‌లోని బంజరాహిల్స్‌కి చెందిన దేవర రాజశేఖర్ బ్యాగుతో అనుమానాస్పదంగా తిరగడంతో స్థానిక పోలీసులు తనిఖీ చేశారు. బ్యాగులో రెండున్నర కేజీల గంజాయి ప్యాకెట్లు ఉన్నట్టు గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ చెప్పారు.

- సోమవారం మధ్యాహ్నంలోపే నాలుగైదు సార్లు కోత
- నక్కపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తరచూ విద్యుత్ అంతరాయం
- స్లాట్ విధానంలో నష్టపోతున్న కక్షిదారులు
- లావాదేవీల్లో తీవ్ర ఇబ్బందులు

రిజిస్ట్రేషన్లకూ కరెంట్ కష్టాలు


నక్కపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం


కరెంటు పోవడంతో లావాదేవీల కోసం వేచి ఉన్న కక్షిదారులు

నక్కపల్లి: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వచ్చే కక్షిదారులకు సీఎం చంద్రబాబు సర్కార్ కరెంట్ షాక్ ఇస్తోంది. పౌరసేవలు సులభతరం, పాలన వేగవంతంపై ఈ - గవర్నెన్స్, వాట్సాప్ గవర్నెస్ వంటి సర్వీసులు గురించి పదేపదే ప్రస్తావిస్తున్న ఆయన క్షేత్రస్థాయిలో కరెంటు కష్టాలు తీర్చడం లేదు. పర్యవసానంగా ఎడాపెడా విద్యుత్ కోతలతో భూక్రయ విక్రయాల రిజిస్ట్రేషన్లు నిలిచిపోతున్నాయి. నక్కపల్లి సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం లోపే నాలుగైదు సార్లు విద్యుత్ సరఫరా నిలిచిపోవడం ఇక్కడ పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఆ సమయంలో గడువులోగా రిజిస్ట్రేషన్ జరగపోతే స్లాట్ రద్దవుతుంది. మళ్లీ బుకింగ్ చేసుకోవడం కక్షిదారులకు ఆర్థిక భారమవుతుంది. దూరాభారం నుంచి వచ్చిన వారు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యే వరకు రోజంతా పడిగాపులు పడాల్సి వస్తుంది.

పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్. రాయవరం మండలాలకు సంబంధించి నక్కపల్లిలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఉంది. ఇక్కడ భూముల క్రయ విక్రయాలు, బ్యాంకు రుణాలకు సంబంధించిన మార్ట్‌గేజ్, తనఖా రిజిస్ట్రేషన్లు, జీపీఏ, వివిధ రకాల ఆస్తులకు సంబంధించిన క్రయవిక్రయాలు, వివాహ రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియ జరుగుతోంది. నిత్యం ఇక్కడ రిజిస్ట్రార్ కార్యాలయంలో 60 నుంచి 70 రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. రోజుకు ప్రభుత్వానికి స్టాంప్‌డ్యూటీ రూపంలో రూ.2 కోట్ల పైనే ఆదాయం లభిస్తుంది. మూడు మండలాలకు చెందిన వారే కాకుండా ఏనీవేర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగంగా ఇతర ప్రాంతాలకు చెందిన వారు ఇక్కడికి వచ్చి లావాదేవీలు నిర్వహించుకుంటారు. గ్రామీణ జిల్లాలో ఎక్కువ రిజిస్ట్రేషన్లు జరిగే కార్యాలయాల్లో నక్కపల్లి ఒకటి. ఇంతటి డిమాండ్ ఉన్న ఈ కార్యాలయంలో ఇటీవల కాలంలో కరెంటు కోతలు కక్షిదారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.

సోమవారం ప్రతి అరగంటకొకసారి కరెంటు కోత

రోజుకు కోట్ల ఆదాయం లభిస్తున్న కార్యాలయంలో కనీసం ఇన్వర్టర్, యూపీఎస్‌గాని, జనరేటర్ సదుపాయంగాని లేదు. విద్యుత్ సరఫరా ఉంటేనే లావాదేవీలు జరుగుతాయి. పొరపాటున కరెంటు పోతే అంతే సంగతులు. సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం లోపు నాలుగైదు సార్లు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ప్రతి అరగంటకొకసారి కరెంటు పోయింది. దీంతో కక్షిదారులు ఇబ్బంది పడ్డారు.

రిజిస్ట్రేషన్ నిలిచిపోతే వర్గ సమీకరణకు ఆపసోపాలు

ఒకొక్కక్క లావాదేవీలకు సంబంధించి చాలా మంది కుటుంబ సభ్యులు, దాయాదులు, వారసులు రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పాల్గొనాల్సి ఉంటుంది. ఇటువంటి ఆస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరిగే సమయంలో కరెంటు పోతే వారి కష్టాలు వర్ణణాతీతం. అదే రోజు రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిలిచిపోతే మరుసటి రోజు వీరందరిని సమీకరించడం తలకు మించిన భారంగా మారుతోందని కొనుగోలుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నక్కపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కేవలం కరెంటు లేకపోవడం వల్లే రిజిస్ట్రేషన్లలో జాప్యం జరుగుతోందని కక్షిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వందలాది రిజిస్ట్రేషన్‌లతో కోట్లాది రూపాయల ఆదాయం తెచ్చి పెడుతున్న కార్యాలయానికి ఇన్వెర్టర్, జనరేటర్ సదుపాయం లేకపోవడం దారుణమన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనికి తోడు కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన స్లాట్ విధానం కక్షిదారులకు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. సుమారు రెండు నెలల నుంచి నక్కపల్లిలో ఎడాపెడా విద్యుత్ కోతల వల్ల రిజిస్ట్రార్ కార్యాలయంలో లావాదేవీలకు అంతరాయం ఏర్పడుతోంది. ఈ విషయం స్థానిక సిబ్బంది, జిల్లా యంత్రాంగం పట్టించుకోకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బుక్ చేసుకున్న స్లాట్ గడువులో రిజిస్ట్రేషన్ పూర్తికాకపోతే దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారంతా తీవ్ర ఇబ్బందులతోపాటు ఆర్థిక భారాన్ని భరించాల్సి వస్తోందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఒక్క నక్కపల్లిలోనే కాదు, జిల్లాలో పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ ఇదే సమస్య ఉన్నట్లు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన కక్షిదారులు చెబుతుండటం గమనార్హం.

కరెంటు పోతే మళ్లీ స్లాట్ బుకింగ్ చేసుకోవాల్సిందే..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రిజిస్ట్రేషన్ లావాదేవీల కోసం స్లాట్ బుకింగ్‌ను ప్రవేశ పెట్టింది. ఆన్‌లైన్‌లో రూ.200 చెల్లించి స్లాట్ బుక్ చేసుకుంటే కక్షిదారులకు 20 నిమిషాలు సమయం కేటాయిస్తారు. రోజు మొత్తంలో 39 స్లాట్‌లు బుక్ చేసుకునే అవకాశం ఉంది. స్లాట్ గడువులోగానే తమ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవాలి. ఈ స్లాట్‌కు కేటాయించిన సమయంలో కరెంటు పోయినా ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తినా అంతే సంగతులు. మరో 20 నిమిషాలు అవకాశం ఇస్తారు. ఈ మొత్తం 40 నిమిషాల్లోగా మొదటి స్లాట్ బుక్ చేసుకున్న వారు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి కాకపోతే ఆరోజు వారి లావాదేవీలు నిలిచిపోయినట్లే. తర్వాత స్లాట్ బుక్ చేసుకున్నవారికి అవకాశం ఇస్తారు. మొదటి స్లాట్‌వారు రోజంతా రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద పడిగాపులు పడాలి. లేదా మరుసటి రోజుకు మరో రూ.200 చెల్లించి స్లాట్ బుక్ చేసుకోవాలి. ఇటువంటి సమస్యలు తలెత్తినప్పుడు దూర ప్రాంతాల నుంచి లావాదేవీల కోసం వచ్చిన కక్షిదారులకు తమ ప్రాంతాలకు వెళ్లలేక ఇక్కడ ఉండలేక ఇబ్బందులు పడుతున్నారు.

దూర ప్రాంతాల వారికి మరీ ఇబ్బంది



సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో కరెంటు పోతే లావాదేవీలు నిలిచిపోతున్నాయి. స్లాట్ గడువులోగా రిజిస్ట్రేషన్ జరగకపోతే తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. మరుసటి రోజుకు స్లాట్ బుక్ చేసుకోవాల్సి వస్తోంది. స్థానికులకు పర్వాలేదు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు మరీ ఇబ్బంది పడుతున్నారు. నిత్యం ఎక్కువగా రిజిస్ట్రేషన్లు జరిగే ఈ కార్యాలయానికి యూపీఎస్‌లు లేకపోవడం దారుణం.

– కోనూరు శ్రీను, కక్షిదారుడు, నక్కపల్లి

కరెంటు లేకపోతే మేమేం చేస్తాం



కరెంటు లేకపోతే మేమేం చేస్తాం. ఉన్నప్పుడే రిజిస్ట్రేషన్లు చేస్తాం. కక్షిదారులు ఇబ్బంది పడితే మాకు సంబంధం ఎంటి. మేమేం చేయలేం. యూపీఎస్‌లు, ఇన్వర్టర్ కొనుగోలు చేయడానికి బడ్జెట్ లేదు. ఈ విషయాన్ని జిల్లా అధికారులకు దృష్టికి తీసుకెళ్లాం.

– సిహెచ్.నర్సింహామూర్తి, సబ్ రిజిస్ట్రార్, నక్కపల్లి

కట్న వేధింపులతో వివాహిత ఆత్మహత్య

- అత్తింటికష్టాలే కారణమని మృతురాలి తల్లి ఫిర్యాదు
- గంగాదేవిపేటలో ఘటన


కుమారి(ఫైల్)


వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ విష్ణుస్వరూప్

మునగపాక: వివాహేతర సంబంధం అంటకట్టడంతోపాటు అదనపు కట్నం వేధింపులు తట్టుకోలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మునగపాక మండలం గంగాదేవిపేటలో సోమవారం చోటు చేసుకుంది. అత్తింటివారి వేధింపులు వల్లే తన కుమార్తె చనిపోయిందని మృతురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మునగపాక పోలీసులు సోమవారం రాత్రి వెల్లడించిన వివరాల ప్రకారం.. మునగపాక మండలం గంగాదేవిపేటకు చెందిన బత్తిన పోతురాజు, వరలక్ష్మి దంపతులు కుమారుడు వెంకటేష్‌కు ఎస్.రాయవరం మండలం రేవు పోలవరం గ్రామానికి చెందిన కుమారితో ఆరు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వారి దాంపత్య జీవితంలో భాగంగా కొంతకాలంగా కుమారి అత్త వరలక్ష్మి, మామ పోతురాజు, బావ సంతోషం, తోటికోడలు సాయి తదితరులు తరచూ అదనపు కట్నం కోసం వేధించేవారు. ఈ విషయమై కుమారి తన తల్లికి పలుమార్లు చెబుతూ బాధపడేది. కుమారి భర్త వెంకటేష్ సింగపూర్‌లో ఉద్యోగరీత్యా ఉంటున్నాడు. వేసవి సెలవులకు ఆమె తన పుట్టింట్లో పిల్లలతో ఉండేది. ఈ క్రమంలో సోమవారం తన పిల్లలను అనకాపల్లిలో స్కూలులో చేర్పించేందుకు అత్తారింటికి వచ్చింది. ఇంతలో ఉరేసుకుని చనిపోయిందంటూ ఆమె మామ ఫోన్‌లో సమాచారం అందించారు. మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రసాదరావు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న పరవాడ డీఎస్పీ విష్ణు స్వరూప్, యలమంచిలి సీఐ ధనుంజయరావు గంగాదేవిపేటలో విచారణ చేపట్టారు. కుమారి మృతదేహాన్ని అనకాపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అసనగిరి వాసులకు మళ్లీ అస్వస్థత

- నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి వెళ్లేందుకు నిరాకరణ
- నాతవరం పీహెచ్‌సీ నుంచి పోలీసు బందోబస్తుతో తరలింపు


నర్సీపట్నం ఆస్పత్రిలో అసనగిరి గ్రామస్తులు

నాతవరం: కలుషిత ఆహారం ఘటనలో మళ్లీ అస్వస్థతకు గురయ్యారు. సోమవారం నాతవరం పీహెచ్‌సీలో వైద్య సేవలు అందించారు. నాతవరం మండలం సుందరకోట పంచాయతీ శివారు అసనగిరి గ్రామానికి చెందిన 12 మంది, కాకినాడ జిల్లా రవతలపూడి మండలం రాఘవట్నం చెందిన 16 మంది కుటుంబ సభ్యులు కలిసి ఈ నెల 14న రాత్రి పాడేరు మోదకొండమ్మ దర్శనానికి వెళ్లారు. అక్కడ పులిహోర తిని మార్గమధ్యంలో పలు చోట్ల మంచినీరు తాగారు. ఈ నెల15న పాడేరులో అస్వస్థతకు గురవడంతో స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్సా అందించారు. ఆరోగ్యం కుదుటపడటంతో అదే రోజు రాత్రికి స్వగ్రామాలకు వచ్చేశారు. అసనగిరిలో వీరికి మరలా అస్వస్థత కావడంతో సోమవారం మధ్యాహ్నం ఆటోల్లో నాతవరం పీహెచ్‌సీకి తీసుకొచ్చారు. అక్కడ వైద్యాధికారులు ప్రసన్న, ఎం.రాజేష్ నాయుడు వైద్య సేవలందించారు. వీరిలో బూటారి దుర్గా సాయిని మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో విశాఖ కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. మిగతా వారిని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా వారు నిరాకరించారు. వైద్యాధికారి వెంటనే తహసీల్దార్, పోలీసులకు సమాచారం ఇచ్చారు. తహసీల్దార్ ఎ. వేణుగోపాల్, వైద్యాధికారి రాజేష్ నాయుడు గిరిజనులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినప్పటికీ వారు అంగీకరించలేదు. దాంతో పోలీసులు బందోబస్తుతో రెండు అంబులైన్సులో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఏరియా ఆస్పత్రిలో అసనగిరికి చెందిన పాండవుల గంగాభవాని, వెలగల వరలక్ష్మి, వెంకట్, కాసుబాబు, బూటారి ములసమ్మ, వెలగల వెంకయ్యమ్మ, రాజు, చల్లా లక్ష్మి, చల్లా ప్రసాద్, బూటారి అనిల్, బూటారి లక్ష్మి చికిత్స పొందుతున్నారని వైద్యాధికారులు తెలిపారు.

కలెక్టరమ్మా.. మా మొర వినండి


డోలీ మోతలు లేకుండా శాశ్వత రోడ్డు వేయాలంటూ గిరిజనుల నిరసన


కోళ్ల ఫారం నిర్మాణ పనులను నిలిపివేయాలంటూ రెండు గ్రామాల ప్రజల నిరసన

- మా సమస్యలు అధికారులకు పట్టడం లేదు
- కార్యాలయాల చుట్టూ తిప్పిస్తున్నారు
- కలెక్టరేట్‌కు వస్తే గేటు బయటకు నెట్టేస్తున్నారు
- పీజీఆర్ఎస్‌లో అర్జీదారుల ఆవేదన

తుమ్మపాల: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థలో పలు సమస్యల పరిష్కారం కోసం అర్జీదారులు వివిధ రూపాల్లో నిరసన వ్యక్తం చేశారు. కలెక్టరేట్ గేటు వద్ద పలు ప్రజా సంఘాల నాయకులు, గ్రామాల వారీగా ప్రజలు ఏకమై ఆందోళనలు చేపట్టారు. జిల్లా అధికారులైనా చర్యలు తీసుకోవాలని ప్లకార్డులు పట్టుకుని ఆవేదన వ్యక్తం చేశారు. పదే పదే కార్యాలయాల చుట్టూ తిరిగినా సమస్యలు పరిష్కారం కావడం లేదని, పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదులు చేస్తే అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని వాపోతున్నారు. పీజీఆర్ఎస్‌పై రోజు రోజుకూ విశ్వాసం తగ్గిపోతున్నా, గత్యంతరం లేక కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నారు. కలెక్టరమ్మ స్పందించి అధికారులకు ఆదేశాలిస్తారనే గంపెడాశలతో సుదూర ప్రాంతాల నుంచి వృద్ధులు, పసిబిడ్డలతో వస్తే గేటు బయట నుంచే అడుగడుగునా ఆంక్షలతో పోలీసులు, సిబ్బంది అడ్డుకుంటున్నారు. సమస్య తీవ్రత ఎంతటిదైనా అర్జీదారుకు మాత్రమే పీజీఆర్ఎస్ వేదిక వద్దకు అనుమతించి మిగిలిన కుటుంబ సభ్యులను బయటకు నెట్టేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పీజీఆర్ఎస్‌లో 282 అర్జీలు నమోదు

పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్ విజయ కృష్ణన్, డీఆర్వో వై.సత్యనారాయణరావు, ఎస్‌డీసీ సుబ్బలక్ష్మి అర్జీలు స్వీకరించి సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత జిల్లా అధికారులు సమస్యల పరిష్కారంపై దృష్టి సారించి పునరావృతం కాకుండా చూడాలన్నారు. మొత్తం 282 అర్జీలు నమోదు కాగా, వాటిలో రెవెన్యూ సంబంధిత భూ సమస్యలు అధికంగా ఉన్నాయి.

86 శాతం అంగవైకల్యం ఉన్నా పింఛన్ ఇవ్వలేదు

పక్షవాతంతో కాళ్లు పనిచేయక నడవలేని స్థితిలో ఉన్నాను. 86 శాతం అంగవైకల్యంతో ఏడాది కాలానికి మాత్రమే వైద్యులు 2024లో సదరం ధ్రువీకరణ పత్రం మంజూరు చేశారు. దాన్ని పట్టుకుని సచివాలయానికి వెళ్తే పింఛన్ రాదని అక్కడ సిబ్బంది నమోదు చేయడం లేదు. నా పరిస్థితి చూసి పింఛన్ మంజూరు చేయాలని అనకాపల్లి మండలం కశింకోటకు చెందిన కిల్లంపల్లి సత్తిబాబు తన కుటుంబ సభ్యుల సహాయంతో వీల్ చైర్‌పై కలెక్టరేట్‌కు వచ్చి మొరపెట్టుకున్నాడు.

కోళ్ల ఫారం పనులపై నిరసనలు

నివాసాలకు సమీపంలో ఏర్పాటు చేస్తున్న కోళ్ల ఫారం పనులను తక్షణమే నిలిపి వేయాలని డిమాండ్ చేస్తూ మునగపాక మండలం రాజుపేట అగ్రహారం, పరవాడ మండలం భరణికం పంచాయతీ కట్టవానిపాలెం గ్రామస్తులు కలెక్టరేట్ వద్ద వేర్వేరుగా నిరసనలు చేపట్టారు. రెండు గ్రామాలకు కేవలం 250 మీటర్ల దూరంలో కోళ్ల ఫారం నిర్మించడం వల్ల ప్రజలపై తీవ్ర ప్రభావం పడుతుందని వాపోయారు. యాజమాన్యాన్ని ప్రశ్నించిన వారిపై రాజకీయ పలుకుబడితో పోలీసులతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, రెండు మండలాల ఎంపీడీవోలకు ఫిర్యాదు చేయగా, విచారించి పనులు నిలిపివేయాలని ఆదేశించారన్నారు. అయినప్పటికీ అధికారుల ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తూ చేపడుతున్న పనులను నిలిపివేయాలని కలెక్టర్‌ను కోరారు.

ఇంకెన్నాళ్లు డోలీ మోత కష్టాలు

శాశ్వత రోడ్డు నిర్మించి డోలీ మోతల కష్టాలు లేకుండా చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో వి.మాడుగుల మండలం అవురువాడ పంచాయతీ కొండవీధి, పెదగోరి గెడ్డ గ్రామాల గిరిజనులు కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. గతంలో రోడ్డు ఏర్పాటు కోసం వాగుపై పిల్లర్లు వేసినప్పటికి మధ్యలోనే పనులు నిలిచిపోయాయి. ఏజెన్సీ పర్యటనలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీ మేరకు రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. మా పిల్లల కోసమైన రోడ్డు వేసి వారి బతుకుల్లో వెలుగులు నింపేందుకు చర్యలు చేపట్టాలని విన్నవించారు.

అనుమతులు లేకున్నా, కొండను తవ్వేస్తున్నారని ఫిర్యాదు

ఎటువంటి అనుమతులు లేకుండా దౌర్జన్యంగా తవ్వేస్తున్న కొండను కాపాడాలని, భారీ మైనింగ్ వాహనాల రాకపోకలతో గ్రామంలో రోడ్లన్నీ ధ్వంసమైపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఎస్.రాయవరం మండలం వేమగిరి గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. కొందరు నాయకుల అండదండలతో గ్రామంలో కొండను తవ్వేసి అక్రమ రవాణా చేయడంపై ప్రశ్నిస్తే గ్రామస్తులపై దాడులకు దిగుతున్నారని, జిల్లా అధికారులు దృష్టి సారించి మా గ్రామాన్ని కాపాడాలని కోరారు.


అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, డీఆర్వో సత్యనారాయణరావు


కుటుంబ సభ్యుల సహాయంతో కలెక్టరేట్‌కు వచ్చిన దివ్యాంగుడు కిల్లంపల్లి సత్తిబాబు

క్లుప్తంగా

శారదా వనాన్ని పరిశీలించిన జిల్లా అటవీ శాఖ అధికారి

సాక్షి ఎఫెక్ట్..

కశింకోట: మండలంలోని బయ్యవరం వద్ద శారద వనాన్ని సోమవారం జిల్లా అటవీ శాఖ అధికారి శ్యామ్యూల్ సందర్శించి పరిశీలించారు. ఇక్కడ అరకొర సౌకర్యాలపై సాక్షిలో 'వనం హీనం' శీర్షికన కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన ఆయన వనాన్ని, అందులో సౌకర్యాలను పరిశీలించినట్లు సమాచారం. రేంజ్ ఆఫీసర్ జ్యోతిర్మయి, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

సాంబశివుని కల్యాణోత్సవం రేపు

కశింకోట: స్థానిక కస్పావీధిలోని ఉమా సాంబశివుని ఆలయంలో ఈ నెల 18న సాంబశివుని కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు అర్చకుడు వెయ్యిదళంల ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరుగుతాయన్నారు. స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను పూలతో అందంగా అలంకరించి సంప్రదాయంగా ఏపీ అర్చక ఎగ్జామినర్ రేజేటి శ్రీరామాచార్యులు ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛరణల నడుమ వైభవంగా కల్యాణం జరిపించనున్నట్లు చెప్పారు. భక్తులు కార్యక్రమంలో పాల్గొవాలని కోరారు.

'ఆరోపణలు అవాస్తవం'

అనకాపల్లి టౌన్: మండలంలోని కూటమి నాయకులు అక్రమ క్వారీలు కలిగి ఉన్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు చేస్తున్న ఆరోపణలు వాస్తవం కాదని తుమ్మపాల ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి నాయకులపై మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చేస్తున్న ఆరోపణలు నిరూపించాలన్నారు. మాకవరం సర్పంచ్ పూడి పరదేశీ నాయుడు, టీడీపీ మండల నాయకుడు కర్రి బాబీ పాల్గొన్నారు.

బాలికల రక్షణకు చట్టాలు



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఏఎస్‌ఐ మణికుమారి

కశింకోట: బాలికల రక్షణకు కల్పించిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఏఎస్‌ఐ ఎస్. మణికుమారి తెలిపారు. సోమవారం స్థానిక బాలికల హైస్కూలులో బాలికల రక్షణకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు, మహిళల రక్షణకు పోక్సోతోపాటు పలు చట్టాలున్నాయన్నారు. అవసరం వచ్చినప్పుడు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలు, బాలికలు ఆత్మరక్షణ కలిగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా గుడ్, బ్యాడ్ టచ్‌ల గురించి అవగాహన కలిగించారు. హెచ్ఎం ఎంఎస్ స్వర్ణకుమారి, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది గౌరి, ఉష, ప్రవళిక, లావణ్య, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 102 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,700	4,700
రెండో రకం	3,880	4,100
మూడో రకం	3,300	3,680

అనకాపల్లి సినిమాలు

రాజా	: భైరవం
సత్యనారాయణ స్క్రీన్-1	: డ్రాగన్
సత్యనారాయణ స్క్రీన్-2	: అందాల రాక్షసి
పర్తిసాయి	: ఖలేజా
షిర్డీసాయి	: థగ్ లైఫ్
వెంకటేశ్వర	: పాప
శ్రీ సత్య	: కట్టప్ప జడ్జిమెంట్
రామచంద్ర	: హంటర్

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 42 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్ 12 యూనిట్లు, బీ పాజిటివ్ -6, ఓ పాజిటివ్ -20, ఏబీ పాజిటివ్ -5 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ యు. లోకేష్‌ను 9703619706 ఫోన్‌లో సంప్రదించాలని కోరారు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 386 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 354 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 సంప్రదించవచ్చు.

అనకాపల్లిలో ఆధార్ కష్టాలు

- కేంద్రాల చుట్టూ రోజూ ప్రదక్షిణలు
- సవరణల కోసం గంటల కొద్దీ నిరీక్షణ
- తెల్లవారే ఆధార్ సెంటర్లకు చేరుకుంటున్న ప్రజలు
- పట్టణంలో వీటి సంఖ్య పెంచాలని డిమాండ్



చోడవరం బస్టాప్ ఎదురుగా ఉన్న ఇండియన్ బ్యాంక్ వద్ద గుమిగూడిన ప్రజలు



చంటి పిల్లలతో ఆధార్ కేంద్రం బయట ఉన్న ప్రజలు




మెయిన్ రోడ్ యూనియన్ బ్యాంక్ వద్ద ఉదయం ఏడు గంటలకే నిరీక్షిస్తున్న ప్రజలు

అనకాపల్లి టౌన్: ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందాలంటే ఆధార్ అనుసంధానం తప్పనిసరైంది. దీంతోపాటు ఆధార్ పొంది పదేళ్లు పూర్తయిన వారికి అప్‌డేట్ చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఇవేగాకుండా ఏ ఇతర గుర్తింపు కార్డులు పొందాలన్నా, వృద్ధులు బస్సుల్లో ప్రయాణించాలన్నా, విద్యార్థులు స్కూళ్లలో చేరాలన్నా, పై చదువులు చదవాలన్నా ఆధార్ అవసరమైంది. ఈ ఆధార్ కార్డు వాడుకలో ఉంటేనే మనిషి బతికున్నట్లు లెక్క. ఈ ఆధార్ కార్డుల్లో పేరు, అడ్రస్, ఫోన్ నెంబర్ మార్పులు, చేర్పులు, బయోమెట్రిక్, నూతన కార్డులు తదితర సేవల కోసం ప్రజలు నిరంతరం ఆధార్ కేంద్రాలకు వస్తున్నారు. వీరు అరకొర ఆధార్ సెంటర్లతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రధానంగా పట్టణంలోని మెయిన్‌రోడ్ యూనియన్ బ్యాంక్, చోడవరం బస్టాప్ ఎదురుగా ఉన్న ఇండియన్ బ్యాంక్, ఉడ్‌పేట యూనియన్ బ్యాంక్, పోస్ట్ ఆఫీస్ ప్రధాన కేంద్రం, గవరపాలెం పోస్ట్ ఆఫీస్‌లలో ఆధార్ సెంటర్ల వద్ద ప్రజలు గంటలు కొద్దీ వేచి చూడాల్సి వస్తోంది. పట్టణ ప్రజలే కాకుండా సమీప గ్రామాలు, మండలాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు ఆధార్ కేంద్రాలకు తరలివస్తున్నారు. వీరంతా ఉదయం 7 గంటల నుంచే బారులు తీరుతున్నారు. ఎవరు ముందు వస్తే వారికే లక్కీడిప్ తరహాలో టోకెన్లు ఇస్తున్నారు. రోజుకు 30 నుంచి 40 మందికి మాత్రమే టోకెన్లు ఇచ్చి మిగిలిన వారికి రిక్తహస్తం చూపిస్తున్నారు. ఆ ముప్పై మంది పనులన్నీ మానుకొని రోజంతా ఈ పనికే కేటాయించి ఉండాల్సి వస్తోంది. అంతా వీలు చూసుకొని ఆధార్ కేంద్రాల వద్ద నిరీక్షిస్తుంటే సర్వర్ డౌన్ అని చెప్పడంతో రోజంతా ఉండాల్సి వస్తుంది. గత కొద్ది రోజుల ముందు స్కూల్స్ ప్రారంభం కావడం తల్లికి వందనం పథకానికి ప్రభుత్వం డబ్బులు అకౌంట్లలో జమచేస్తుంది. వీరిలో కొంత మంది విద్యార్థులకు ఆధార్ అప్‌డేట్ అవ్వలేదని, అందుకే అకౌంట్లో డబ్బులు పడలేదని చెప్పడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆధార్ కేంద్రాలకు క్యూ కడుతున్నారు. వృద్ధులు వేలిముద్రలు సరిగా పడడంలేదని వారు పింఛన్ డబ్బులు తీసుకోవడంలో ఇబ్బందులు పడుతున్నారు. వారికి మరలా బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకొని కొత్త కార్డు తీసుకోవల్సి రావడంతో అవస్థలకు గురవుతున్నారు.

అదనంగా నగదు వసూళ్లు..

ఆధార్ సెంటర్లలో కార్డుల మార్పులు, చేర్పులు సేవలకు ప్రభుత్వం సూచించిన దానికంటే ఎక్కువగా డబ్బులు వసూలు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఒక్క బయోమెట్రిక్ సేవ కోసమే రూ.100, మిగిలిన ఏ సేవ అయినా రూ.50 వసూలు చేయాల్సి ఉండగా, ఆయా వ్యక్తుల బట్టి అధికంగా వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసలు ఆధార్ సెంటర్ల నిర్వహణ ఎవరు చూసుకుంటారనేది అధికారుల వద్ద సరైన సమాచారం లేదు. ఈ కేంద్రంలో వచ్చే అసౌకర్యాలపై ఎవరికీ ఫిర్యాదు చేయాలో అర్థం కావడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఆధార్ కేంద్రాల వద్ద కూడా పరిష్కారం కాని సమస్యలకు టోల్ ఫ్రీ నంబరు 1947కి కాల్ చేస్తే పరిష్కారమవుతుంది. దీనిపై చాలామందికి అవగాహన కొరవడింది. అధికారులు ఆ దిశగా చైతన్యవంతం చేయడం లేదు.



రోజుకు 30 మందికి మాత్రమే తమ సేవలు ఉంటాయని తెలియజేస్తున్న బోర్డు

పనులు మానుకొని..



ఉదయం ఏడు గంటలకే ఆధార్ కేంద్రం వద్దకు వచ్చాను. పనులు మానుకొని వేచి చూడాల్సి వస్తుంది. ముందుగా వచ్చిన వారికే టోకెన్ ఇస్తున్నారు.

– కొత్రా హరి, అనకాపల్లి

సర్వర్ పనిచేయడం లేదు



ఆధార్ సెంటర్ల సంఖ్యను పెంచాలి. ప్రతీ పనికి ఆధార్ తప్పని సరి చేస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాము. సర్వర్ పనిచేయడం లేదని మరుసటి రోజు రమ్మంటున్నారు.

– జెట్టి శ్రీనివాస్, అనకాపల్లి

వారం రోజులుగా తిరుగుతున్నా



వారం రోజుల నుంచి తిరుగుతున్నాను. మా గ్రామంలో ఆధార్ సెంటర్ లేకపోవడం వలన తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రాలలో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి.

-కె. అప్పారావు, హరిపాలెం

రాజా సాబ్ ట్రైలర్ ప్రదర్శన

అనకాపల్లి టౌన్: స్థానిక సత్యనారాయణ థియేటర్‌లో పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన చిత్రం రాజా సాబ్ ట్రైలర్ ప్రదర్శించారు. సోమవారం ఇక్కడ జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రభాస్ ఫ్యాన్స్ అధ్యక్షుడు రాజు, కాండ్రేగుల జోగేంద్ర పాల్గొని కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ప్రభాస్ ఫ్యాన్స్ గౌరవ అధ్యక్షుడు ఆళ్ల ప్రవీణ్ కుమార్ మంగవరపు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి అదృశ్యం



నూకాలమ్మ

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం శివారు బంగారయ్యపేటకు చెందిన పక్కుర్తి నూకాలమ్మ (79) అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ ఎస్. మణికుమారి తెలిపారు. ఈ నెల 13వ తేదీ నుంచి ఆమె కనిపించకుండా పోయిందని కుమారుడు శ్రీను ఫిర్యాదు చేశాడు. తన భార్యతో కూలీ పనికి వెళ్లి తిరిగివచ్చి చూసేసరికి ఇంటి దగ్గర తల్లి లేదు. ఈ విషయమై స్థానికులు, బంధువుల ఇళ్ల వద్ద వెతికినప్పటికీ ఆచూకీ లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. సీఐ అల్లు స్వామినాయుడు పర్యవేక్షణలో కేసు విచారణ చేపట్టామని ఏఎస్ఐ తెలిపారు.

కశింకోట పశు వైద్యాధికారిగా చైతన్యమణి



బాధ్యతలు చేపడుతున్న కశింకోట, నరసింగబిల్లి పశు వైద్యాధికారులు చైతన్యమణి, అల్ఫోన్స్

కశింకోట: మండల పశు వైద్యాధికారిగా చైతన్యమణి నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం కశింకోట పశు వైద్య కేంద్రంలో బాధ్యతలు చేపట్టారు. ప్రభుత్వం నిర్వహించిన బదిలీల్లో భాగంగా ఆమె నరసింగబిల్లి నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసే అల్ఫోన్స్ జార్జ్ నరసింగబిల్లికి బదిలీ అయ్యారు. ఆమె అక్కడ బాధ్యతలు చేపట్టారు. మొత్తం మీద ఇక్కడి వైద్యురాలు అక్కడ, అక్కడి వైద్యురాలు ఇక్కడ నియమితులయ్యారు.

డీవీఎంసీ సభ్యుడు మర్యాద పూర్వక కలయిక



సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రామానందకు పుష్పగుచ్ఛం అందచేస్తున్న డీవీఎంసీ సభ్యుడు మధుబాబు

అనకాపల్లి: సాధారణ బదిలీలో భాగంగా జిల్లాలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి బోని రామానందంను జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడు రేబాక మధుబాబు సోమవారం మర్యాద పూర్వకంగా కలశారు. ఆయన్ను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇక్కడ విధులు నిర్వహించిన అధికారి అజయ్‌బాబు ఆర్నెల్ల క్రితం పదవీ విరమణ చేశారు. ఆ స్థానంలో విజయనగరం జిల్లా నుంచి రామానందం బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, సంక్షేమ పథకాలను అందేవిధంగా చర్యలు చేపడతామన్నారు. వసతి గృహాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.

'మేహాద్రి'లో ఈత ప్రమాదకరం



మేహాద్రి రిజర్వాయర్‌లో ఈత కొడుతున్న యువకులను బయటకు పంపుతున్న పోలీసులు

పెందుర్తి: ప్రమాదకరమైన ఊబి, లోతు ఉన్న మేహాద్రి గెడ్డ రిజర్వాయర్‌లో ఈత చాలా ప్రమాదకరమని పెందుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి.సతీష్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం మధ్యాహ్నం మేహాద్రి గెడ్డ రిజర్వాయర్‌లో కొంత మంది యువకులు ఈతకు దిగినట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే స్పందించిన సీఐ సిబ్బందిని అక్కడికి పంపి యువకులను బయటకు రప్పించారు. కౌన్సిలింగ్ ఇచ్చి అక్కడి నుంచి పంపారు. ప్రమాదాలు చెప్పి రావు అని.. పిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా సీఐ సూచించారు.

మృతుని కుటుంబానికి న్యాయం చేయాలి

సబ్బవరం: వంగలిలో ఏర్పాటు అవుతున్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ యూనివర్సిటీ నిర్మాణ సమయంలో ఓ వ్యక్తి ఇటీవల భవనం పైనుంచి జారిపడి మృతి చెందిన ఘటనలో బాధిత కుటుంబానికి తగిన న్యాయం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఉప్పాడ సత్యవతి సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ నెల 9న జారి పడి మృతి చెందిన భవన నిర్మాణ కార్మికుడు షేక్ ఉమరవల్లికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారన్నారు. వారికి మృతి చెందిన సమయంలో రూ.3 లక్షల నష్ట పరిహారం, రూ.15 లక్షల బీమా సదుపాయం కల్పిస్తామని నమ్మబలికి అగ్రిమెంట్ చేయించుకుని వదిలించుకున్నారని ఆమె ఆరోపించారు. మృతుని కుటుంబానికి రూ.50 లక్షల నష్ట పరిహారంతో పాటు కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ ఘటనపై స్పందించి కంపెనీ భద్రత, సేఫ్టీ నిబంధనలు పాటిస్తున్నారా? లేదా? అని ఆరా తీయాలన్నారు.

అర్హులకు రేషన్ కార్డులు మంజూరు చేయాలి



ఎంపీడీవో రమేష్‌నాయుడుకు వినతిపత్రం అందిస్తున్న టిడ్కో కాలనీ మహిళలు

పరవాడ: అర్హులైన నిరుపేదలకు కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని అనకాపల్లి జిల్లా ఐద్వా అధ్యక్షురాలు పిట్ల మాణిక్యం డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఐద్వా ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట సోమవారం టిడ్కో గృహ సముదాయం లబ్ధిదారులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గొర్లివానిపాలెం టిడ్కో కాలనీలో అర్హులైన నిరుపేదలకు రేషన్ కార్డులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొత్త పింఛన్ల మంజూరు కోసం ఏడాది కాలంగా ఎదురు చూస్తున్నారన్నారు. టిడ్కో కాలనీలో వీధి లైట్లు ఏర్పాటు చేసి విద్యుత్ కనెక్షన్ ఇవ్వకుండా వదిలేశారని, చీకటి పడితే విష జంతువుల మధ్య సావాసం చేయాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కాలనీకి చెత్త బండి రాకపోవడంతో ఎక్కడికక్కడ చెత్త కుప్పలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతుందన్నారు. కాలనీలో ప్రతి వీధిలో సీసీ కెమెరాలను అమర్చి, రేషన్ డిపో ద్వారా 14 రకాల నిత్యావసర సరకులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవో రమేష్‌నాయుడుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల అధ్యక్షురాలు బంగారమ్మ, కార్యదర్శి అన్నపూర్ణ, సంతోషి, సీతామహాలక్ష్మి, అబద్దం సీతమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

'యాజమాన్యం నిర్లక్ష్యంతోనే ఫార్మాలో ప్రమాదం'

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలోని ఎస్ఎస్ ఫార్మా పరిశ్రమలో ప్రమాదం మానవ తప్పిదం కాదని, యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే జరిగిందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ ఆరోపించారు. పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో ఇద్దరు భద్రత సిబ్బంది మరణించడమే కాకుండా కార్మికుడు తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలయ్యాడని చెప్పారు. ప్రమాదాన్ని మానవ తప్పిదంగా దృష్టి మళ్లించి భద్రత డొల్లతనాన్ని కప్పిపుచ్చుకోవాలని చూస్తుందని విమర్శించారు.

కశింకోటలో అన్న సమారాధన



శివాలయంలో ఏర్పాటు చేసిన అన్న సమారాధన

కశింకోట: స్థానిక సర్వమంగళాంబ సమేత త్రిపురాంతకస్వామి ఆలయం (శివాలయం)లో సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ అర్చకుడు వి. చిదంబరం, వి. కృష్ణల ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.

తీరంలో క్షీణించిన పారిశుధ్యం



చెత్తతో నిండిన ముత్యాలమ్మపాలెం తీరం

పరవాడ: ముత్యాలమ్మపాలెం సముద్ర తీరంలో పారిశుధ్యం క్షీణించింది. బీచ్‌కు వచ్చిన సందర్శకులు తాగి వదిలేసిన బీరు బాటిళ్లు, మద్యం సీసాలు, ఆకులు, టీ కప్పులు, ప్లాస్టిక్ కవర్లు తీరంలో ఎక్కడికక్కడ పేరుకుపోయాయి. సముద్రం లోపల నుంచి తీరానికి కొట్టుకొచ్చిన చెత్తా చెదారాలు కుప్పలు తెప్పలుగా దర్శనమిస్తున్నాయి. తీరంలో ఏర్పాటు చేసిన శ్మశానవాటికలో మృతదేహాలను తగులబెట్టిన కర్రలు, తదితర సామగ్రి ఎక్కడికక్కడ పేరుకుపోవడంతో బీచ్ అందాలను తిలకించడానికి వచ్చిన సందర్శకులు ఇబ్బందులు పడుతున్నారు. తీరాన్ని పరిశుభ్రంగా ఉంచేలా పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలని పర్యాటకులు కోరుతున్నారు.

ఆరుతడి పంటలపై ఆసక్తి

రోలుగుంట : తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు వచ్చే ఆరుతడి పంటలపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. దుక్కులు చేసుకుని పెసలు, మినప, నువ్వులు విస్తారంగా వేశారు. వాతావరణం అనుకూలించడంతో నువ్వులు, పెసలు గింజకట్టాయి. కుంచం రూ.300 పలకడంతో పెట్టుబడులు పోను ఆదాయం బాగుంటుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అప్పన్నకు ఘనంగా నిత్య కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్య కల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేసి, ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు, తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

అతిసార నివారణకు అవగాహన



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో బాలాజీ

అనకాపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ నెల 16 నుంచి జూలై 31వ తేదీ వరకూ అతిసార నివారణ వేడుకలు నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో ఓ బాలాజీ తెలిపారు. స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయంలో అతిసార బ్యానర్లు, పోస్టర్లు సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాతావరణ మార్పులు, వర్షాకాలం రావడంతో జూన్ నుంచి డిసెంబర్ వరకు వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందన్నారు. వ్యాధులు బారిన పడకుండా ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. 0 నుంచి 5 సంవత్సరాల పిల్లలకు, గర్భిణులు, బాలింతలు వాంతులు, విరోచనాలు బారిన పడకుండా కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, మలవిసర్జన తర్వాత సబ్బుతో చేతులు పరిశుభ్రం చేసుకోవాలని పేర్కొన్నారు. 3-4 సార్లు నీళ్ల విరేచనాలైతే ఆరోగ్య కార్యకర్తలను సంప్రదించాలని, ప్రతి ఇంటిని సందర్శించి బాలింతలకు, గర్భిణులకు అతిసార వ్యాధిపై అవగాహన కల్పించాలని, ఓఆర్ఎస్ ద్రావణం తయారీ విధానాన్ని ఆశవర్కర్లు నేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనిజేషన్ అధికారి ఓ. చంద్రశేఖర్ దేవ్, జిల్లా గణాంక శాఖ అధికారి ఎ. రామచంద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపఖజానా కార్యాలయంలో నిలిచిన సేవలు

- పిడుగు పడి ఐదు రోజులుగా పనిచేయని కంప్యూటర్లు, ప్రింటర్లు
- వివిధ పనుల కోసం కక్షిదారుల ప్రదక్షిణలు



ఉపఖజానా కార్యాలయంలో పనిచేయని కంప్యూటర్లు,ప్రింటర్లు



యలమంచిలి ఉప ఖజానా కార్యాలయం

యలమంచిలి రూరల్: యలమంచిలి ఉప ఖజానా కార్యాలయంలో ఐదు రోజులుగా కంప్యూటర్లు, ప్రింటర్లు పనిచేయడం లేదు. దీంతో ఈ కార్యాలయం ద్వారా ప్రాసెస్ కావాల్సిన బిల్లులకు చిక్కులు తప్పడం లేదు. ఈ నెల 9న యలమంచిలి పట్టణంలో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఆ సమయంలో స్థానిక ఉపఖజానా కార్యాలయం సమీపంలో పిడుగులు పడ్డాయి. దీంతో కార్యాలయంలో మొత్తం కంప్యూటర్లు, ప్రింటర్లు, ల్యాప్‌టాప్‌లు, ఎలక్ట్రానిక్ డివైస్‌లు, కొన్ని విద్యుత్ వైర్లు కాలిపోయాయి. అప్పటి నుంచి ఇక్కడ సేవలన్నీ స్తంభించిపోయాయి. యలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురం మండలాలకు సంబంధించిన 2 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు, 1200 మంది పెన్షనర్లు, మరికొన్ని శాఖల అధికారుల జీతభత్యాలు, వసతి గృహాలు, గ్రామ పంచాయతీలు, మండల పరిషత్ సహా ప్రభుత్వ నిధుల వ్యయానికి సంబంధించిన సుమారు 1000కి పైగా బిల్లులన్నీ ఇక్కడ ఉపఖజానా కార్యాలయం ద్వారానే ఆమోదం పొందాల్సి ఉండగా.. 50కి పైగా పెండింగ్‌లో ఉన్నాయి. సేవలు స్తంభించిపోవడంతో వివిధ పనులపై వస్తున్న పెన్షనర్లు కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఉపఖజానాధికారి, మరో ఉద్యోగి తమ సొంత ల్యాప్‌టాప్‌లు తెచ్చి పలు అత్యవసర పనులు పూర్తి చేస్తున్నారు. మిగతా సిబ్బందికి పనిలేకపోవడంతో ఖాళీగా కూర్చోవాల్సి వస్తోంది. ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా కార్యాలయంలో సేవలు యథాతథంగా అందించేలా చర్యలు తీసుకోవాల్సిన ఖజానా శాఖాధికారులు నిర్లక్ష్యం చూపుతున్నట్టు పలువురు ఆరోపిస్తున్నారు. దీని పై యలమంచిలి ఉప ఖజానాధికారి టి.ఉదయభాస్కరరావును సంప్రదించగా పిడుగు పడడంతో కంప్యూటర్లు, ప్రింటర్లు, ఇతర వస్తువులు పాడైనమాట వాస్తవమేనన్నారు. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు. కక్షిదారులకు ఇబ్బందులు లేకుండా త్వరలోనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామన్నారు.